క్లుప్తంగా

రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయాలని వినతి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ నర్సింహ, ప్రవీణ్

మీర్‌పేట: రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేయాలని కోరుతూ మీర్‌పేట కార్పొరేషన్ 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ సోమవారం జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మీర్‌పేటలోని 26, 6 డివిజన్‌లలోని కాలనీల్లో మూడు, నాలుగు రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోందని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవి కావడంతో ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోందని జేఎం దృష్టికి తీసుకెళ్లారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని, రోజు విడిచి రోజు నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో నర్సింహతో పాటు నాయకుడు ప్రవీణ్ ఉన్నారు.

ఉత్సాహంగా 'శిజ్నే' సాంస్కృతిక ఉత్సవం

మీర్‌పేట: మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవ ముగింపులో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన 'శిజ్నే' సాంస్కృతిక ఉత్సవం ఉత్సాహంగా జరిగింది. ఈ వేడుకకు ప్రముఖ గాయని జోనితా గాంధీ హాజరై తన పాటలతో విద్యార్థినీ, విద్యార్థులను ఉర్రూతలూగించారు. గాంధీతో పాటు మరో గాయకుడు రోల్‌రైడా ఆలపించిన పాటలకు యువత ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం విద్యాసంస్థల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి గాయని జోనితా గాంధీని సత్కరించారు.

ఘనంగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

కందుకూరు: కందుకూరు గ్రామంలో సోమవారం ఉదయం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం మరుసటి రోజు రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో భక్తులు పోటాపోటీగా రథాన్ని లాగి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నా, పెద్దా అంతా రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు.

శ్రీరామనవమి ఉత్సవ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడలో నూతనంగా శ్రీరామనవమి ఉత్సవ కమిటీని గ్రామస్తుల సమక్షంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బొక్క బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొక్క సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సొడపు శేఖర్‌గౌడ్, సామ ప్రకాశ్‌రెడ్డి, కార్యదర్శులుగా తల్లోజు చంద్రశేఖరాచారి, కోశాధికారిగా పుల్లగూరల తిరుపతిరెడ్డి, సలహాదారులుగా రాయిచెట్టు యాదయ్య, బొక్క లోకేశ్వర్‌రెడ్డి, బొక్క నరేందర్‌రెడ్డి, బొక్క సత్యనారాయణరెడ్డి, కుమ్మరి లక్ష్మయ్య, పిట్టల యాదయ్య, బొక్క హన్మంత్ రెడ్డిలను ఎన్నుకున్నామన్నారు. కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

శివ మారుతీ గీత అయ్యప్ప మందిరంలో అన్నదానం

షాద్‌నగర్: అన్నదానం మహాదానం అని ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి రేటికల్ నందీశ్వర్ అన్నారు. సోమవారం పట్టణంలోని శివ మారుతీ గీత అయ్యప్ప మందిరంలో కల్పవృక్ష ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నందీశ్వర్ ప్రారంభించి మాట్లాడుతూ.. దేవాలయంలో ప్రతీ సోమవారం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరూ దాన గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మల్లికార్జున్, దేవదాస్, సుమంత్, మల్లేశ్, రాజు, ఆలయ మేనేజర్ రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ పిలుస్తోంది

సాంకేతిక విద్య విద్యార్థుల భవితకు బాటలు వేస్తోంది. పదో తరగతి అనంతరం డిప్లొమా కోర్సులు చేసే వారికి పాలిటెక్నిక్ కళాశాలలు దన్నుగా నిలుస్తుండగా.. ఈ కాలేజీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య ఏటేటా పెరుగుతోంది.

డిప్లొమా అనంతరం ఉజ్వల భవిష్యత్తు

- ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో అనేక ఉద్యోగ అవకాశాలు
- ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- 19 వరకు గడువు, మే 13న పాలిసెట్



మహేశ్వరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

మహేశ్వరం: పాలిటెక్నిక్ విద్యకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో 2025- 26 విద్యా సంవత్సరానికి కోర్సుల్లో అడ్మిషన్లకు ప్రవేశ పరీక్ష (పాలిసెట్) దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇటీవల పదో తరగతి వార్షిక పరీక్షలు రాసిన వారితో పాటు, ఇప్పటికే పాసయిన వారు ఈ అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

సర్కారు కళాశాలలో 180 సీట్లు

మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో 2023- 24 సంవత్సరంలో ప్రభుత్వం.. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించింది. ఇందులో మూడు డిప్లొమా కోర్సులు, 180 సీట్లు ఉన్నాయి. కోర్సులు.. సివిల్ ఇంజినీరింగ్-60 సీట్లు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్(ఈఈఈ)-60 సీట్లు, మెకానికల్ ఇంజినీరింగ్-60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం మూడు సంవత్సరాలకు కలిపి 540 మంది సాంకేతిక విద్యను అభ్యసిస్తున్నారు.

ఉద్యోగ అవకాశాలు

పాలిటెక్నిక్ డిప్లొమాలో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్స్ కోర్సులు పూర్తి చేసే వారికి వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. సాఫ్ట్‌వేర్, ఇంజినీరింగ్, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, ఏయిర్ లైన్స్, ట్రాన్స్‌పోర్టు, గనులు, ఇండియన్ ఆర్మి, నేవి, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, జెన్‌కో, బీహెచ్‌ఈఎల్, టాటా, బీడీఎల్, డిఫెన్స్, డీఆర్‌డీఎల్, ఆర్‌సీఐ, బీఎస్ఎన్ఎల్ మొదలగు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

మహేశ్వరంలో భారీ పరిశ్రమలు

హైదరాబాద్‌కు చేరువలో ఉన్న మహేశ్వరం మండలంలో ఐటీ, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ కంపెనీలు అనేకంగా ఉన్నాయి. రావిర్యాలలో హార్డ్‌వేర్ పార్కు, శ్రీనగర్‌లో ఈ-సిటీ(ఫ్యాబ్‌సిటీ), తుమ్మలూరులో ప్లాస్టిక్ పార్కు, మంఖాల్ ఇండస్ట్రీ పార్కు, మహేశ్వరం మండల కేంద్రంలో విప్రో, మలబార్ గోల్డ్ కంపెనీలతో పాటు, కొంగర కలాన్‌లో ఫాక్స్‌కాన్, కెన్స్, ఆదిబట్లలో టాటా కంపెనీలు ఉన్నాయి. డిప్లొమా అనంతరం ఎక్కడో కాకుండా.. స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు ఉండటంతో, పాలిటెక్నిక్‌లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. కోర్సు పూర్తి చేసిన తర్వాత ఈ సెట్ పరీక్ష రాసి, నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో చేరవచ్చు.

దరఖాస్తు వివరాలు

పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పాలిటెక్నిక్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజు రూ.250 కాగా, బీసీ, జనరల్ కేటగిరి వారికి రూ. 500 చెల్లించాలి. ఆలస్య రుసుం రూ.100తో ఏప్రిల్ 22 వరకు, రూ.300 ఫీజుతో ఏప్రిల్ 23 వరకు గడువు కల్పించారు. డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్ష మే 13న నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలు ఎస్‌బిటిఈటి.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో చూడవచ్చు.

"వినియోగించుకోండి..



పది పరీక్ష రాసిన వారితో పాటు పూర్తయిన వారు పాలిసెట్‌కు అర్హులు. అర్హత పరీక్ష రాసి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలలో సీట్లు పొందవచ్చు. టెన్త్ పూర్తయిన వారు సీటు సాధించాలంటే ప్రత్యేక శిక్షణ అవసరం లేదు. పది సిలబస్‌తోనే ప్రశ్నలు ఉంటాయి. కష్టపడి చదివితే సీటు ఖాయం. డిప్లొమా అనంతరం ఉద్యోగ అవకాశాలు చాలా ఉన్నాయి. అర్హులు వినియోగించుకోవాలి.

– పి.నాగరాజ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, మహేశ్వరం

జూన్ వరకు పనులు పూర్తి చేయాలి



నబీల్ కాలనీలో ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

పహాడీషరీఫ్: వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు జల్‌పల్లి మున్సిపాలిటీలోని నబీల్ కాలనీ ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పూర్తిచేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. నబీల్ కాలనీలో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులను సోమవారం ఆమె మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, డీఈ ఇష్రత్ ఆయేషాలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2020 సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలతో ఈ ప్రాంతమంతా ముంపునకు గురైందన్నారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నగర వ్యాప్తంగా రూ.850 కోట్ల నిధులతో ఎస్ఎన్‌డీపీ బాక్స్ నాలాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఒక్క మహేశ్వరం నియోజకవర్గంలోనే రూ.100కోట్లతో ఈ పనులు చేపట్టామన్నారు. ఇప్పటివరకు 60 శాతం మేర పూర్తయ్యాయని, మిగిలిన పనులను జూన్‌వరకు పూర్తి చేసేలా ఈ ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. ప్రస్తుతం జల్‌పల్లి నబీల్‌కాలనీలో కొనసాగుతున్న రెండో ఎస్ఎన్‌డీపీ నాలాకు జీహెచ్ఎంసీ తరఫున 69 శాతం, జల్‌పల్లి మున్సిపాలిటీ నుంచి 31శాతం చొప్పున నిధుల కేటాయింపులు జరుగుతున్నాయన్నారు. ఈ పనులు పూర్తయితే నబీల్ కాలనీ ప్రజలకు ముంపు కష్టాలు దూరమవుతాయన్నారు. బాలాపూర్ కొత్తమోని కుంట నుంచి గ్రీన్ సిటీ, డ్రీమ్, మెట్రో సిటీలలో మొదటి దఫా ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పూర్తయ్యాయని తెలిపారు. అంతకుముందు ఆమె కొత్తపేట రోడ్డులో నిర్మించిన బిన్ గాలిబ్ స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించారు. బార్కాస్ సలాలలో ఫైసల్ బామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈద్-మిలాప్ కార్యక్రమంలో సబితారెడ్డితో పాటు ఆమె తనయుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఎమ్మెల్యే పర్యటనలో నాయకులు కైసర్ బామ్, అబ్దుల్లా గాలిబ్, జనార్దన్, షేక్ అఫ్జల్, పల్లపు శంకర్, యంజాల అర్జున్, ఉష్కెమూరి నిరంజన్, సయీద్ పటేల్, సయీద్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



పోలీస్ బందోబస్తు మధ్య కొనసాగుతున్న నిరసన ర్యాలీ

పహాడీషరీఫ్: వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణకు లోక్‌సభ, రాజ్యసభలలో ఆమోదానికి వ్యతిరేకంగా జల్‌పల్లి మున్సిపాలిటీలోని మైనార్టీ నాయకులు సోమవారం శాంతియుత నిరసన ర్యాలీని చేపట్టారు. షాహీన్‌నగర్ నుంచి ఎర్రకుంట చౌరస్తా వరకు కొనసాగిన ఈ ర్యాలీలో ముస్లింలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. బిల్లును వెంటనే వెనక్కి తీసుకోకపోతే ఏప్రిల్ 13న ట్యాంక్‌బండ్ వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. ర్యాలీ సందర్భంగా మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతారెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య

మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయులు ఉన్నత పదవులు పొందినప్పుడే సంతోషాన్ని పొందుతారని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య అన్నారు. సోమవారం కనకమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి వెంకటయ్య పదవీ విరమణ పొందడంతో అదే పాఠశాలలో పనిచేస్తున్న ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు హమీద్‌కు ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు కనకమామిడి పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు రాంచందర్, పీఆర్టీయూ మండల బాధ్యులు బందయ్య, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి

బీజేవైఎం జిల్లా నాయకుడు కరుణాకర్‌రెడ్డి

చేవెళ్ల: పట్టణంలో ఈ నెల 12న నిర్వహించే వీర హనుమాన్ శోభాయాత్రను హిందువులందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీజేవైఎం జిల్లా నాయకుడు కరుణాకర్‌రెడ్డి కోరారు. మండలంలోని గుండాల గ్రామంలో సోమవారం వీరహనుమాన్ శోభాయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త నిష్టతో ధర్మకోసం పనిచేయాలని, హిందూ సంఘటితం కోసం నిర్వహించే వీరహనుమాన్ శోభాయాత్రలో పెద్దసంఖ్యలో హిందువులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పేద, ధనిక, నిమ్న, అగ్రవర్గాలు అనే భేదం లేకుండా హిందువులంతా సంఘటితమై నిలబడాలని కోరారు.

రజతోత్సవ మహాసభకు తరలిరండి


మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా హన్మకొండలో నిర్వహించే రజతోత్సవ మహాసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కొత్తూరు, కేశంపేట, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాలు, మున్సిపాలిటీల పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కనీవిని ఎరుగని రీతిలో పార్టీ అధిష్ఠానం మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్షలాది మందితో ఈ నెల 27న హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను నిర్వహిస్తున్నట్లు లక్షలాది మంది హాజరయ్యే ఈ సభకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామ గ్రామం నుంచి భారీఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఎంఎస్ నటరాజన్, వెంకట్‌రెడ్డి, చీపిరి రవి యాదవ్, దేవేందర్‌యాదవ్, లక్ష్మీనారాయణ, మురళీధర్‌రెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలపై శిక్షణ



మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చేవెళ్ల: గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు వెల్స్‌పన్ ఫౌండేషన్, ఏఐఎస్ఈసీటీల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్స్‌పన్ గ్రూప్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సుధీర్‌కుమార్ తెలిపారు. చేవెళ్లలో సోమవారం ఉచిత శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్హత కలిగి ఉండి 18 సంవత్సరాలపై బడిన నిరుద్యోగ యువత వృత్తి నైపుణ్యాల శిక్షణ తరగతులకు అర్హులని చెప్పారు. ప్రధానంగా డిమాండ్ ఉన్న డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, ప్లంబర్ జనరల్, మిషన్ టైలింగ్ అనే నాలుగు కోర్సులలో యువతకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వెల్స్‌పన్ ప్రతినిధి సురేఖ, సునందాదేవి, విశాల్‌శర్మ, రవీంద్ర, ఉపేందర్, కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మత విద్వేషాలకు కేరాఫ్ బీజేపీ

మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణనాయక్



గుమ్మడవెల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: దేశంలో మత విద్వేషాలకు బీజేపీ ప్రభుత్వం పునాది వేస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి పెంటారెడ్డి విమర్శించారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గుమ్మడవెల్లి, మాదాపూర్ గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో అడుగడుగునా అవహేళన చేసేలా మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆరోపించారు. కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొడపు వెంకటేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు అందుగుల సత్యనారాయణ, ఎండీ అఫ్జల్‌బేగ్, సరికొండ జగన్, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, సయ్యద్ అజీజ్, ఎండీ సులేమాన్, మంద సాయిలు, దంతోజు నర్సింహాచారి, డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ఏ.సురేందర్, నాయకులు పి.శ్రీనివాస్, మహేందర్, శ్రీకాంత్, వి.బాబు, బి.పాండురంగారెడ్డి, కుమార్, శేఖర్, యాదగిరి పాల్గొన్నారు.

కేంద్రం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోంది

టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి, నాయకులు

మహేశ్వరం: దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి, పులిమక్త(హబిబుల్‌గూడ), గొల్లూరు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్ర నిర్వహించి, బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం గత పదేళ్ల నుంచి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగ విలువలను కాలగర్భంలో కలిపేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. పార్లమెంట్ వేదికగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. రాజ్యంగ విలువలు, ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్‌తోనే దేశంలో దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. అంతకుముందు జైసంవిధాన్‌పై కరపత్రాలు పంపిణీ చేశారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ నర్సింహ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాకలి యాదయ్య, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సమత, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ, సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, ఆవుల యాదయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పెండ్యాల బాల్‌రాజ్, గొల్లూరు మాజీ సర్పంచ్ హరినాథ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● బీజేపీ నాయకులు



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న కమలనాథులు

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి పార్టీ శ్రేణులు గడపగడపకు వెళ్లి, ప్రజలకు వివరించాలని ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్ సూచించారు. పట్టణంలోని 15వ వార్డులో సోమవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాషాయం జెండాను పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ.. మోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి చెందుతోందని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, నాయకులు నర్సింహ, తల్లోజు శ్రీను, దుర్గయ్య, కృష్ణయ్య, రవి, యాదయ్య, రాజు, జనిగల గిరి, జగన్, యాదగిరి, రమేశ్, నర్సింహ, శ్రీదర్, మధు, జగన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి సాకిబండతండాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు విక్రంరెడ్డి, లక్ష్మణ్, రవిరాథోడ్, బాలునాయక్, నరేందర్‌రాథోడ్, జానయ్య, మణిపాల్‌నాయక్, నరేశ్‌నాయక్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



బడిబాట వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, గ్రామస్తులు

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం వాల్‌పోస్టర్లు, కరపత్రాన్ని గ్రామపెద్దలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని గ్రామస్తులకు సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేస్తుందన్నారు. తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. దీనిపై స్పందించిన గ్రామస్తులు గ్రామంలోకి వచ్చే ప్రైవేట్ స్కూల్ బస్సులను బహిష్కరించి, వచ్చే జూన్‌లో కనీసం 40 నుంచి 50 మంది విద్యార్థులను తమ పాఠశాలలో చదివే విధంగా చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆటాపాటలతో కూడిన విద్యను అందిస్తామని తెలిపారు. ఆకృతి స్వచ్ఛంద సంస్థ పాఠశాలకు ల్యాప్ ట్యాప్ విరాళంగా అందజేశారు. వారికి పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులుగౌడ్, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వర్షిత, ఎస్ఎంసీ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్య, గ్రామస్తులు బలరాం, సతీశ్, శ్రీనివాస్, రుక్మద్దీన్ తదితరులు ఉన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

నందిగామ: నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో గ్రామానికి చెందిన కిందిబావి యాదయ్య ఇంట్లో సోమవారం ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు అర్హులైన లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నిరుపేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ప్రవేశ పెట్టిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీఖాన్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమార్, కృష్ణ, బుచ్చయ్య, సీతారాం, ప్రభాకర్, రవి, ప్రతాప్, సురేశ్, వెంకటేశ్‌గౌడ్, యాదయ్య, తేజగౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.